సాక్షి పల్నాడు

శనివారం ● 13 ● జూలై ● 2024



వైభవంగా హరిద్ర శృంగారార్చన

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో గల శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు.



పేదలకు అన్నదానం

తెనాలి అర్బన్: కాళికా మాత దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆషాఢమాస ఉత్సవాలు

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్లూరులో దేశమ్మ తల్లి ఆషాఢమాస ఉత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. పొంగళ్లు పొంగించి, జలబిందెలతో అమ్మవారికి వారుపోశారు.

న్యూస్‌రీల్

త్రికోటేశ్వరుడికి రూ.81.72 లక్షల ఆదాయం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం హుండీ కానుకల్ని శుక్రవారం లెక్కించారు. దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, సింగరుట్ల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో సీహెచ్. నాగిరెడ్డి పర్యవేక్షించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.76,63,351, అన్నదానం హుండీ ద్వారా రూ.5,09,440 ఆదాయం లభించినట్లు వివరించారు. 125 రోజులకు గాను మొత్తం రూ.81,72,791 వచ్చినట్లు తెలిపారు. దీంతో పాటు వెండి 695గ్రాములు, బంగారం 36.500గ్రాములు, విదేశీ కరెన్సీ 105 అమెరికన్ డాలర్లు, 15 ఆస్ట్రేలియన్ డాలర్లు, రెండు సింగపూర్ డాలర్లు, 100 పౌండ్లు సూడాన్ కరెన్సీ హుండీల ద్వారా వచ్చినట్లు తెలిపారు. లెక్కింపులో కెనరా బ్యాంక్ తంగేడుమల్లి బ్యాంక్ మేనేజర్, సిబ్బంది, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు ఉపాధ్యాయురాలి ఎంపిక



దుర్గి: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 15,16 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న జాతీయ సదస్సుకు మండల పరిధిలోని ఓబులేశునిపల్లె ఎస్‌కేఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు బి.బి.టి. సుందరి ఎంపిక అయ్యారు. భారత ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఈ సదస్సు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు సుందరిని హెచ్‌ఎం జె. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటితో ముగియనున్న ధ్రువపత్రాల పరిశీలన



యడ్లపాడు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్‌ఈడీ) రెండేళ్ల కోర్సు ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారంతో ముగుస్తుందని ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్ కళాశాల) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌కే సలీంబాషా తెలిపారు. కళాశాలలో ఈనెల 9వ తేదీ నుంచి ఫస్టియర్ ప్రవేశాలకు సంబంధించిన సర్టిఫికెట్ పరిశీలన ప్రారంభమైనట్లు చెప్పారు. బోయపాలెంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో రెండేళ్ల డీఎడ్ కోర్సుకు మొత్తం 150 సీట్లు ఉన్నాయన్నారు. ఇవిగాక జిల్లాలోని ప్రైవేటు కళాశాలల్లోనూ చేరేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే కౌన్సెలింగ్ ద్వారా 122 మంది విద్యార్థులు చేరినట్లు పేర్కొన్నారు. వీరిలో డైట్ కళాశాలలో 73 మంది, ప్రైవేటు కళాశాలల్లో 49 మంది అడ్మిషన్ లేటర్లు పొందారని వివరించారు. ఇంకా కోర్సులో చేరేందుకు అర్హత ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లైసెన్స్ లేకుండా నర్సరీలు నిర్వహిస్తే చర్యలు



నరసరావుపేటరూరల్: లైసెన్స్ లేకుండా నర్సరీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని గురవాయపాలెం, పమిడిపాడు గ్రామాల్లోని షేడ్ నెట్ నర్సరీలను శుక్రవారం ఆయన సందర్శించారు. నారు పెంపకంపై యజమానులకు సూచనలు చేశారు. ప్రతి నర్సరీ యజమాని వారం రోజుల్లో రైతు సేవా కేంద్రాల్లో అర్జీలను అందజేసి లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. ప్రతి షేడ్ నెట్ నర్సరీ యజమాని రిజిస్టర్‌ను నిర్వహించాలని, యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. నర్సరీ నిబంధనలు పాటించాలని నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, షాహీర్, నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

దారుణ పరపతి

సాగు ప్రారంభంలో ప్రతి రైతుకీ పెట్టుబడే ప్రధాన సమస్య. చేతిలో చిల్లిగవ్వ ఉండదు. అప్పొసొప్పొ చేసి సాగు చేయాల్సిన పరిస్థితి. బ్యాంకులు గుమ్మం తొక్కాలంటే సవాలక్ష నిబంధనలు. రైతు రెక్కల కష్టానికి భుజం కాస్తూ వెన్నుదన్నుగా ఉండాల్సిన ప్రభుత్వం ఆచరణలోకి వచ్చేసరికి మొహం చాటేస్తూనే ఉంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అంటూ ప్రకటించి చేతులు దులుపుకుంది. గత వైఎస్సార్ ప్రభుత్వంలో సాగు ప్రారంభంలోనే పెట్టుబడి సాయంతో పాటు రుణాల్ని పారదర్శకంగా అందించి రైతులకు అండదండగా నిలిచింది. ప్రస్తుతం పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో పంటలకు రుణ పరిమితిని అరకొరగా పెంచి, బ్యాంకులకు నివేదికను అధికారులు అందించి చేతులు దులుపుకున్నారు.



సాగుకు సిద్ధం చేస్తున్న పొలం

- జిల్లాలో పంట రుణాల పరిమితి ఖరారు
- బ్యాంకులకు చేరిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నివేదిక
- రూపొందించిన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ టెక్నికల్ కమిటీ
- జిల్లా సమావేశంలో అధికారుల ఆమోదం

యడ్లపాడు: పంట రుణాల పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారైంది. ఇప్పటికే నివేదిక జిల్లాలోని అన్ని బ్యాంకులకు చేరింది. పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఉమ్మడి గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు టెక్నికల్ కమిటీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయించింది. ఈ నివేదికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపించగా, దాన్ని పరిశీలించి, సవరించింది. నివేదికను ఆమోదించి కూడా తిరిగి పంపించింది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పునఃపరిశీలన అనంతరం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో, ఎల్‌డీఎంల ద్వారా అన్ని బ్యాంకులకు పంపారు.

సాధారణ పెంపుదలతో సరి

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో పెద్దగా చెప్పుకోదగ్గ పరిణామాలు లేవు. గత ఏడాదితో పోలిస్తే సాధారణ పెంపు మాత్రమే జరిగింది. కొన్ని పంటలకు 5 నుంచి 10శాతం, మరికొన్ని పంటలకు 10 నుంచి 15శాతం పెంచడం గమనార్హం. అన్ని బ్యాంకులకు వీటిని కమ్యూనికేషన్ చేసినప్పటికీ ఎన్నికల కారణంగా కొన్ని పంట రుణాల పంపిణీ చేపట్టలేదు. మరికొన్ని బ్యాంకులు రెన్యువల్ చేయడం వరకే పరిమితమయ్యాయి. ఇక సహకార బ్యాంకుల దారి మరో రకంగా ఉంది. గతనెల చివరి వరకు శాఖల వారీగా అందించే రికవరీ పర్సెంటేజీలను బట్టి ఆయా బ్యాంకులకు కొత్త రుణాల మంజూరు ప్రక్రియను ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలో ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ దశలో రైతులకు పెట్టుబడి సాయం ఎంతో అవసరం. జిల్లా కలెక్టర్, వ్యవసాయ యంత్రాంగం చొరవ తీసుకొని పంట రుణాల పంపిణీని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

కొన్ని ప్రధాన పంట రుణాల పరిమితి వివరాలు

పంటపేరు	స్కేల్ ఆఫ్‌ఫైనాన్స్ (రూపాయల్లో)
వరి	42000–46000
శ్రీవరి	32000–35000
పత్తి	42000–46000
చెరకు	90000–100000
వేరుశనగ	31000–35000
మొక్కజొన్న	42000–45000
జొన్న	21000–23000
రాగులు	16000–20000
కొర్రలు	16000–19000
సజ్జలు	16000–22000
ఆముదాలు	18000–20000
నువ్వులు	13000–14000
మినుము,పెసలు	20000–22000
సోయాబీన్	12000–15000
సన్‌ఫ్లవర్	21000–26000
కొత్తిమీర/ధనియాలు	20000–22000
పప్పుధాన్యాలు	15000–17000
మల్బరీ	100000–1100000
పచ్చి మిరప	90000–95000
ఎండుమిరప	1150000–1250000
పొగాకు	90000–100000
పసుపు	100000–1100000
అరటి టిష్యూకల్చర్	1150000–1300000
మామిడి, జామ	45000–50000
ఉల్లి(రోజ్), కర్బూజ	55000–60000
టమాటా	35000–38000
టమాటా(హైబ్రీడ్)	65000–70000
టమాటా (ట్రిల్లీస్)	95000–1100000
పుచ్చకాయ	40000–45000
సపోట	30000–40000
నిమ్మ	70000–80000
సీతాఫలం	20000–25000
క్యారెట్	30000–35000

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- రామలింగేశ్వరస్వామి ఉత్సవాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

వినుకొండ(నూజెండ్ల): తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండ కొండపై గల శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఉత్సవాల్ని ఈ నెల 17న ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, ఆహారం తదితర విషయాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. అదే రోజు మొహర్రం పండుగ ఉన్నందున ఏకాదశి ఉత్సవాలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే జి.వి. ఆంజనేయులు మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థలు సేవలు అందించాలని కోరారు. పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం స్వామి చరిత్రను తెలిపే కరపత్రాల్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సరోజ, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ దస్తగిరి పాల్గొన్నారు.

గుండ్లకమ్మ నుంచి వినుకొండకు తాగునీరు

వినుకొండ పట్టణానికి తాగునీరు అందించే సింగర చెరువును ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, కలెక్టర్ పి. అరుణ్‌బాబు మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువు అడుగంటిందని, గుండ్లకమ్మ నది నుంచి పట్టణానికి తాగునీటి సరఫరా చేయాలని కలెక్టర్ అధికారుల్ని ఆదేశించారు.

ఆర్టీసీ బస్సు నుంచి పొగలు

- టైర్‌కు పంక్చర్
- డ్రమ్ముకు, టైరుకు మధ్య రాపిడి జరగడం వల్ల పొగలు
- డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు సురక్షితం



బస్సు వెనుక భాగం నుంచి వస్తున్న పొగలు

అమరావతి:గుంటూరు–అమరావతి మధ్యలోఆర్టీసీ బస్సు వెనుక టైర్ వద్ద పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తం కావడంతోప్రమాదం తప్పింది. సంఘటన వివరాలలోకి వెళితే.. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో గుంటూరు నుండి క్రోసూరు వెళ్లే బస్సు అమరావతి సమీపంలోకి రాగానే కుడి వైపు వెనుక టైరు పంక్చరైంది. బ్రేక్ డ్రమ్ పట్టుకుపోయి రాపిడి వల్ల పెద్దఎత్తున పొగలు వ్యాపించాయి. వెనుక టైరు వద్ద పొగలు వస్తుండటం గమనించి అప్రమత్తమైన డ్రైవర్ బస్సు నిలిపి వేశాడు. ప్రయాణికులు భయభ్రాంతులకు గురై బస్సు నుంచి దిగి ఆందోళనతో పరుగులు తీశారు. తర్వాత స్థానికులు, ఆర్టీసి సిబ్బంది కలిసి మంటలు చెలరేగకుండా నీరు పోశారు. ఎటువంటి నష్టం, ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై గుంటూరు–1 డిపో మేనేజర్ ప్రసాద్ వివరణ ఇస్తూ.. సాధారణంగా బ్రేక్ డ్రమ్ములు వేడెక్కుతుంటాయన్నారు. ఈ సంఘటనలో పంచర్ కావడంతో డ్రమ్ముకు, టైరుకు రాపిడి జరగడం వల్ల పొగలు వచ్చాయని చెప్పారు. ప్రయాణికుల్ని వేరే బస్సులో గమ్యస్థానాలకు చేర్చామని, బస్సుకు మరమ్మతులు జరిపి డిపోకు తరలించామని తెలిపారు.

నీళ్ల విరేచనాలపై అశ్రద్ధ వద్దు

- వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందాలి
- డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బి.రవి



లెనిన్ నగర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో, స్టేట్ టీమ్ సభ్యులు

పిడుగురాళ్ల: నీళ్ల విరేచనాలు అయితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి ఉచితంగా వైద్య సేవలు పొందాలని పల్నాడు జిల్లా డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవి సూచించారు. పట్టణంలోని మారుతీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో డయేరియా కేసులు నమోదు కావడంతో శుక్రవారం స్టేట్ ఎపిడెమిక్ టీమ్ సభ్యులు పరిసరాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ మారుతీ నగర్ పరిధిలో అతిసార వ్యాధి కేసులతో పాటు కాలనీ పరిసరాల్ని, తాగునీటికి పరిశీలించినట్లు చెప్పారు. ప్రజలంతా కాచిచల్లార్చిన సురక్షితమైన మంచినీటిని మాత్రమే తాగాలని ఆయన సూచించారు. పరిశుభ్రమైన ఆహారాన్ని తినాలని, ప్రతి ఒక్కరు మరుగుదొడ్లు ఉపయోగించాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రవితేజ, డాక్టర్ నస్రీన్, మాచవరం డాక్టర్ పద్మావతి, పీహెచ్‌వో హర్షవర్ధన్, ఎంపీహెచ్‌ఈవోలు సుబ్రహ్మణ్యం, పట్టాబి, రసూల్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో భారత్ స్కౌట్స్ గైడ్స్ శాఖలు

జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నిర్ణయం



సమావేశంలో స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్‌లు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని ప్రారంభించాలని స్కౌట్స్ జిల్లా స్థాయి ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నిర్ణయించారు. ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని స్కౌట్స్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కేఎంఏ హుస్సేన్, మండల విద్యాశాఖాధికారి, స్కౌట్స్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా పరిధిలోని స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు హాజరయ్యారు. విద్యార్థులలో క్రమశిక్షణ, సేవానిరతిని పెంపొందించే దిశగా ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శాఖల్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్లు రాంబాబు, వెంకటరెడ్డి, జవహర్, టి.అంజిరెడ్డి, కెప్టెన్ పద్మావతి పాల్గొన్నారు.

రేపటి నుంచి కార్మెల్‌మాత ఉత్సవాలు



కొండపై కార్మెల్ మాత ఆలయం



కార్మెల్ మాత స్వరూపం

ఫిరంగిపురం: కార్మెల్ కొండపై కార్మెల్‌మాత ఉత్సవాలు ఈనెల 14,15,16 తేదీల్లో నిర్వహించనున్నట్లు బాల ఏసుదేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా 14న ఉదయం కొండపైన దివ్యపూజాబలి కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. 15న కూడా కొండపైన దివ్యపూజాబలి ఉంటుందని చెప్పారు. సాయంత్రం దివ్యసత్ప్రసాదంతో ప్రదక్షిణ ఆరాధన బాల ఏసుదేవాలయం నుంచి కొండమెట్ల వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య పాల్గొంటారన్నారు. 16న ఉదయం దివ్యపూజాబలి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులకు కొండపైన తాగునీటి వసతి కల్పించామన్నారు. అనేక ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పాఠశాల , కార్మెల్ మాత వసతి భవనం వద్ద భోజన వసతి కల్పించినట్లు వివరించారు. కార్మెల్ మాత ఉత్సవాలకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఫిరంగిపురం వస్తారు. మూడురోజులు నిర్వహించే దివ్యపూజాబలి కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు.

నా భర్త చావుకు కారణం ఎస్‌ఐ శ్రీహరి

- దుర్గారావు భార్య ధనలక్ష్మి ఆరోపణ
- మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు ఆర్డీవో విచారణ



మెజిస్ట్రీరియల్ విచారణ జరుపుతున్న గురజాల ఆర్డీవో ఎం. రమాకాంతరెడ్డి

వెల్దుర్తి: తన భర్త చౌడుపల్లి దుర్గారావు మృతికి అప్పటి వెల్దుర్తి ఎస్‌ఐ వి. శ్రీహరి కారణమని చౌడుపల్లి ధనలక్ష్మి గురజాల గురజాల ఆర్డీవో ఎం. రమాకాంతరెడ్డికి వాంగ్మూలం ఇచ్చింది. ఈ ఏడాది జనవరి 28న ఎస్‌ఐ వేధింపులు భరించలేక పడవలో ఉన్న తాడును మెడకు చుట్టుకొని కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని విన్నవించుకుంది. దుర్గారావు మృతిపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఆమె ఫిర్యాదు చేసింది. కమిషన్‌ను ఆదేశాల మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఎస్‌ఐ వి శ్రీహరి తన భర్తను లక్షల రూపాయల కొద్దీ డబ్బులివ్వాలని వేధించారని, పోలీసులు కొడతారనే భయంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపింది. ఈ ఏడాది జనవరి 28న భర్త ఆత్మహత్యకు పాల్పడితే, కేసు నమోదు చేసుకోకుండా ఎస్‌ఐ శ్రీహరి ఇబ్బందులకు గురి చేశాడని ఆరోపించింది. ఆయనపై విచారణ చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరింది. దుర్గారావు బావమరిది సోరాడ బ్రహ్మాజీని కూడా ఆర్డీవో విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. విచారణలో తహసీల్దార్ చంద్రశేఖర్, డెప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, వీఆర్వో యలమంద పాల్గొన్నారు.

‘ఆషా’జనక సంకేతం

- ‘తెర’తెరాల తెనాలి వైభవం
- ఆంధ్రాప్యారిస్‌లో కొత్త ‘షో’యగం
- ఆషా థియేటర్ రెనోవేషన్ పనులు ప్రారంభం
- వరుసగా థియేటర్లు మూతపడుతున్న వేళ శుభసంకేతం



ఆషా థియేటర్ రెనోవేషన్ పనులకు శ్రీకారం

తెనాలి: వరుసగా సినిమా థియేటర్లు మూతపడుతున్న ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో ఎంతోకాలంగా మూత పడి ఉన్న ఆషా డీలక్స్ థియేటర్ మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. రెనోవేషన్ పనులు మొదలయ్యాయి. సరికొత్త హంగులతో కొత్తగా థియేటర్ రానుండటం విశేషమే కదా! ఈ నేపథ్యంలో తరతరాలుగా తెనాలిలో థియేటర్ల వైభవం గురించి ఓసారి తెలుసుకుందాం..

ఉజ్వలంగా వెలిగిన థియేటర్లు

రత్నా టాకీస్, శ్రీవెంకటేశ్వర, శ్రీసత్యనారాయణ.. ఇవన్నీ తెనాలిలో ఒకప్పుడు ఉజ్వలంగా వెలిగి అదృశ్యమైన సినిమా థియేటర్లు. ప్రేక్షకులకు వెండితెర వినోదాన్ని పంచిన ప్రముఖ థియేటర్లు కొన్నేళ్లుగా ఒకదాని తర్వాత మరొకటిగా మూతపడుతూ వచ్చాయి. తర్వాత అవన్నీ షాపింగ్ కాంప్లెక్సులు, కల్యాణమండపాలుగా మారాయి. ప్రస్తుతానికి నడుస్తున్న థియేటర్లలో కొన్నింటిని అతికష్టమ్మీద లాగిస్తున్నారు. సినిమాల విడుదల తగ్గిపోయి థియేటర్ల నిర్వహణ భారంగా తయారవడమే ఇందుకు కారణమని చెప్పనవసరం లేదు.

టీవీ, ఓటీటీ ప్రభావంతో కళావిహీనం

టీవీ, ఇంటర్నెట్ పాపులర్ అయ్యాక సినిమాలకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ప్రస్తుత తరం హీరోలు సినిమాల సంఖ్యను బాగా తగ్గించేశారు. ఏడాదికి ఒక సినిమా కూడా చేయడం లేదు. రెండుమూడేళ్లకో సినిమా తాపీగా చేస్తున్నారు. ఫలితంగా థియేటర్లలో సినిమాల విడుదలకు వెతుక్కోవాల్సి వస్తోంది. దీనికితోడు ఓటీటీ ప్రభావం ఉండనే ఉంది. ఇన్ని కారణాలతో కొన్నేళ్లుగా తెనాలిలో థియేటర్ల నిర్వహణ భారంగా మారింది. ఖర్చులు భరించలేక ఒక్కో సినిమా థియేటర్ మూతపడుతూ వస్తోంది.

మూతపడిన థియేటర్లు

పట్టణంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన శ్రీవేంకటేశ్వర థియేటర్, రత్నా టాకీస్‌లు మూసేశారు. వాటి స్థానంలో షాపింగ్ కాంప్లెక్సులు వచ్చాయి. ప్రముఖ సినీ నటి లక్ష్మీరాజ్యం, తన ప్రియమైన స్నేహితురాలు కాంచనమాల కోసమని ఇక్కడే ఇల్లు, సినిమా థియేటర్‌ను నిర్మించుకున్నారు. బోసురోడ్డు చివర్లో ఆమె ముచ్చటపడి నిర్మించుకున్న రాజ్యం థియేటర్, తర్వాతి కాలంలో చేతులు మారింది. నిర్వహణ భారం కావటంతో కల్యాణ మండపంగా పెళ్లిళ్లకు వేదికగా మారింది. శ్రీసత్యనారాయణ టాకీస్ ఫంక్షన్ హాలుగా మారింది. వేద డీలక్స్ స్థానంలో షాపింగ్ మాల్ నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన మరుసటి ఏడాది స్వరాజ్ పేరుతో బోసురోడ్డులో నిర్మించిన స్వరాజ్ టాకీస్‌ను కొంతకాలం మూసేసి 2021లో కూల్చేశారు. గతేడాది అదే బోసురోడ్డులోని వీనస్ థియేటర్ అదృశ్యమైంది. ఈ రెండు ప్రదేశాల్లోనూ ఏ షాపింగ్ కాంప్లెక్సులో రానున్నాయి. బోసురోడ్డు, ఆ పరిసరాల్లోని ఐదు థియేటర్లలో ఇప్పుడు కేవలం పెమ్మసాని థియేటర్ మాత్రమే నడుస్తోంది. మొత్తమ్మీద పట్టణంలో తొమ్మిది సినిమా హాళ్లు ఉండగా వీటిలో మూడు జంట థియేటర్లు. మిగిలిన మూడు ఒంటరి థియేటర్లలో రెండు భారంగా నడుస్తున్నాయి.

2010లో మూతపడిన ఆషా థియేటర్

రైల్వేస్టేషన్‌కు దగ్గర్లోనే ఆషా డీలక్స్ థియేటర్ ఉంది. ఈ థియేటర్ పక్కనే ప్రియా, సంగమేశ్వర కాంప్లెక్సులు నడుస్తున్నాయి. రెండు కాంప్లెక్సుల్లో నాలుగు థియేటర్లు ఉన్నాయి. పక్కనే మూతపడి కళా విహీనంగా ఉన్న ఆషా డీలక్స్‌ను చూసే ప్రేక్షకులకు ఒకనాటి ఈ థియేటరు వైభవం తలపుకొస్తుంది. 1981లో చక్రవర్తి అనే వ్యాపారి నిర్మించారు. ఈ థియేటర్‌లో తొలిరోజున సూపర్‌స్టార్ కృష్ణ ప్రజారాజ్యం, మిథున్ చక్రవర్తి నటించిన డిస్కో డాన్సర్ సినిమాలు ప్రారంభ చిత్రాలుగా వేశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, మురళీమోహన్, కృష్ణంరాజు వంటి హీరోల సినిమాలను ఎన్నింటినో ప్రదర్శించారు. పెదరాయుడు, సూరిగాడు, తాండ్ర పాపారాయుడు, బొబ్బిలి బ్రహ్మన్న వంటి ఎన్నో సినిమాలు ఆడాయి. ఈ సినిమా థియేటర్ కూడా వివిధ కారణాలతో 2010లో మూతపడింది. ఈ థియేటర్ మళ్లీ సరికొత్త సొబగులు అద్దుకుంటుందన్న భావన ఎవరిలోనూ లేదు. ఏదొకరోజు ఏ షాపింగ్ కాంప్లెక్సో, మరో కల్యాణమండపంగానో మారుతుందని అనుకునేవారు. ఇలాంటి నేపథ్యంలో ఈ థియేటర్ ముందు ప్లాక్లెయిన్‌తో పనులు జరుగుతుండటం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. వాకబు చేస్తే రెనోవేషన్ పనులు మొదలుపెట్టారని తెలిసింది. చక్రవర్తి కుమారుడు, ప్రస్తుత యజమాని డాక్టర్ జస్వంత్ ఇదే విషయాన్ని వెల్లడించారు. అనివార్య కారణాలతో మూసివేసిన ఆషా డీలక్స్ థియేటర్‌ను త్వరలోనే ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

వరుస సినిమాలతో కళకళ

ఒకప్పుడు వెండితెరకు స్వర్ణయుగమని తెలిసిందే. ఒక్కో హీరో ఏడాదికి పదికిపైగా సినిమాల్లో నటించేవారు. తెనాలికి చెందిన బుర్రిపాలెం బుల్లోడు సూపర్‌స్టార్ కృష్ణ, మరో హీరో మురళీమోహన్ పోటాపోటీగా ఒకే ఏడాది 17, 18 సినిమాల్లో నటించిన రికార్డు ఉంది. వరుస సినిమాల విడుదలతో థియేటర్లు కళకళలాడుతుండేవి. ప్రేక్షకులు ఆదరించిన సినిమాలు శతదినోత్సవాలు, రజతోత్సవాలను జరుపుకునేవి. దేవదాసు సినిమా రెండో రిలీజప్పుడు తెనాలిలో 300 రోజులు ఆడిందంటే ఇప్పటి ప్రేక్షకులకు అంత నమ్మశక్యం కాకున్నా నిజం.

క్లుప్తంగా

26 పరుగులతో కర్నూలు విజయం

ఐదు వికెట్లు సాధించిన సాయి సూర్యతేజ్



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్ బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 బాలుర క్రికెట్ పోటీల్లో శుక్రవారం కర్నూలు, కడప జిల్లాల జట్లు తలపడ్డాయి. ఇందులో కర్నూలు జట్టు 26 పరుగుల తేడాతో కడప జట్టుపై విజయం సాధించింది. కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులు చేసింది. కర్నూలు జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో రెండవ రోజు ఓవర్ నైట్ స్కోర్ ఎనిమిది వికెట్లు నష్టానికి 117 పరుగులతో చివరిరోజు ఆట ప్రారంభించి మరో ఏడు పరుగులు జోడించి ఆలౌట్ అయింది. జట్టులోని పి.రోహిత్‌గౌడ్ 32 పరుగులు చేయగా, కడప బౌలర్ ఏ.శుభకాశ్యప్ మూడు వికెట్లు సాధించాడు. అనంతరం 186 పరుగుల విజయ లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 160 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని జి.వి.సాయిసాకేత్ 63 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఓటమి తప్పలేదు. కర్నూలు బౌలర్ కె.సాయిసూర్య తేజ్ 14ఓవర్లు వేసి 33 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు సాధించి కడప ఓటమిని శాసించాడు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

పొలాల్లో రైతు బలవన్మరణం

చిలకలూరిపేట టౌన్: పొలాల్లో రైతు బలవన్మరణం పొందిన ఘటన చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..16వ నంబర్ జాతీయ రహదారిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న పంట పొలాల్లో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానిక రైతులు శుక్రవారం గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకుని అతని వద్ద ఉన్న ఆధారాల సేకరించారు. మృతుడు పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన బాడుగుల నాగరాజు(38)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నూతలపాడు గ్రామంలోని పురుగుల మందుల షాపులో పనిచేస్తూ 20 ఎకరాలను నాలుగేళ్లుగా కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. అందులో రూ.45 లక్షలు నష్టం వచ్చి అప్పుల పాలు కావడంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో చెప్పకుండా వచ్చి ఈ ప్రాంతంలో ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య సామ్రాజ్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు.

స్థల వివాదమే ఘర్షణకు కారణం

ఇరువర్గాలకు చెందిన 17మందిపై కేసు నమోదు

వెల్దుర్తి: ఇటీవల మండలంలోని శ్రీరాంపురంతండాలో జరిగిన ఘర్షణ రాజకీయ పరమైంది కాదని, రెండు కుటుంబాల మధ్య జరిగిన స్థల వివాదమే కారణమని మాచర్ల రూరల్ సీఐ కె. సురేష్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరాంపురంతండాలో ఓ స్థలం విషయంలో కేతావత్, పాత్లావత్ వర్గాల మధ్య గత 20 ఏళ్లుగా వివాదం జరుగుతోందన్నారు. కేతావత్ గోవిందునాయక్ ఈ స్థలంపై ఇంజక్షన్ ఆర్డర్ తీసుకొని పాత్లావత్ వర్గం వారికి నోటీసులు పంపినట్లు చెప్పారు. దీంతో పాత్లావత్ అంజినాయక్ ఆధ్వర్యంలో జేసీబీ తీసుకొచ్చి ఇంటిని ధ్వంసం చేశారని తెలిపారు. ఈ విషయంపై పాత్లావత్ పెద అంజీనాయక్‌తో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశామని చెప్పారు. పాత్లావత్ అంజీనాయక్‌పై దాడి చేసిన గాయపరిచిన విషయంలో కేతావత్ హనుమానాయక్‌తో పాటు మరో తొమ్మిది మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో ఏఎస్ఐ తాలూకా రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాచర్ల రూరల్ సీఐ కె. సురేష్

పోస్టల్ ఖాతాల నిర్వహణలో అవినీతిపై విచారణ

నరసరావుపేట టౌన్: పోస్టల్ ఖాతాల నిర్వహణలో అవినీతి జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై శాఖాపరమైన విచారణ చేపట్టినట్లు డివిజనల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి శుక్రవారం తెలిపారు. ఆరోపణల్ని దృష్టిలో ఉంచుకుని డివిజనల్‌లోని ప్రతి పోస్టల్ కార్యాలయంలో పర్సనల్ వెరిఫికేషన్ సూచనతో బ్యానర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఖాతాదారులకు సందేహాలు నివృత్తి, సలహాల కోసం 9493590300 నంబర్‌కు ఫోన్ చేసి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసు చేసుకోవచ్చని తెలిపారు. దగ్గరిలోని సబ్ పోస్ట్, హెడ్ పోస్ట్ ఆఫీస్‌లను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకొని, పాస్‌బుక్ బ్యాలెన్స్‌ను సరి చూసుకోవాలని ఆయన సూచించారు.

పేరుకే బహిరంగం... టీడీపీ కనుసన్నలలోనే వేలం

అచ్చంపేట: టీడీపీ కనుసన్నలలోనే వేలం పాటలు నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో స్వయంభు సత్తెమ్మతల్లి దేవాలయం, ఓర్వకల్లులోని గంగాదేవి పేరంటాలమ్మ దేవాలయాల వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసుకుని ఏడాది పాటు విక్రయ హక్కులు పొందేందుకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తారు. దేవాలయం వద్ద గురువారం జరగాల్సిన బహిరంగ వేలాన్ని కారణం లేకుండానే వాయిదా వేశారు. ఈ విషయం కనీసం ఆలయ కమిటీ చైర్మన్‌కు గానీ గ్రామ సర్పంచ్‌కు కూడా తెలియదు. స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన నాయకులు కలసి వారికి అనుకూలమైన వారికి వేలం లేకుండానే నామమాత్రపు రేట్లపై స్టాల్స్ కట్టబెట్టేందుకే వాయిదా వేశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే అమ్మవారి దేవాలయానికి రావాల్సిన ఆదాయం గణనీయంగా పడిపోవడం ఖాయం. అయితే, కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి మాత్రం కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేయాల్సి వచ్చిందని చెబుతున్నారు. కానీ ఆ కారణాలు ఏమిటో చెప్పలేకపోవడం గమనార్హం.

టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో గంగాదేవి ఆలయం వద్ద వేలం

ఓర్వకల్లులోని గంగాదేవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద స్టాల్స్ నిర్వహణ హక్కులు పొందేందుకు శుక్రవారం నిర్వహించిన వేలంలో (బహిరంగం కాదు) గతం కంటే 10శాతం కన్నా తక్కువ ధరలతో అనుకూలమైన వ్యక్తులకు పాటలు కొట్టివేశారు. ఎనిమిది రకాల వ్యాపారాలకు వేలం నిర్వహించారు. గత ఏడాది ఈ వ్యాపార హక్కులపై అమ్మవారి దేవాలయానికి రూ.7,44,000 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అన్ని వ్యాపారాలపై కలపి రూ.65000 మాత్రమే పెంచి రూ.8,15,000కు కొట్టేశారు. వేలం విషయం గ్రామ సర్పంచి, ఆలయ కమిటీ చైర్మన్‌లకు కనీస సమాచారం లేనట్లు తెలిసింది. టీడీపీ, జనసేన నాయకులు మాత్రమే హాజరు కావడం గమనార్హం. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి, ఆలయ కార్యనిర్వహణాధికారి జి.రామకోటిరెడ్డి, టీడీపీ నాయకుడు పూల కోటేశ్వరరావు, జనసేన నాయకుడు పూల నాగరాజు పాల్గొన్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో అర్ధరాత్రి తనిఖీలు

- బయటపడ్డ ఈసీజీ టెక్నీషియన్ల పనితీరు
- రాత్రి నుంచి కనపడని సిబ్బంది
- క్యాజువాల్టిలో ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్ దందా
- పోలీసులకు అప్పగింత



తనిఖీల సందర్భంగా ప్రైవేటు ల్యాబ్‌టెక్నీషియన్‌ను ప్రశ్నిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: రోగులు, వారి సహాయకుల ఫిర్యాదుల మేరకు గుంటూరు జీజీహెచ్‌లో గురువారం అర్ధరాత్రి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తనిఖీలు చేపట్టారు. రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఆస్పత్రిలో అత్యవసర చికిత్స విభాగాలను ఆకస్మికంగా పరిశీలించారు. వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్యాజువాల్టీ రిజిస్ట్రేషన్ కేంద్రం వద్ద ఒకరు మాత్రమే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పని చేస్తున్నారని చెప్పారు. రోగుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా మరొకరిని నియమించాలని ఆదేశించినా కాంట్రాక్టర్ పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అర్ధరాత్రి తనకు ఫోన్ చేసి సిబ్బంది పని చేయడం లేదని రోగులు ఫిర్యాదులు చేస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికైనా గమనించి మరొకరిని నియమించేలా కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరేడు నెలల నుంచి ఈసీజీ టెక్నీషియన్ రాత్రి పూట ఒకరు మాత్రమే పని చేస్తున్నారని, మరొకరు అర్ధరాత్రి నుంచి విధులకు డుమ్మా కొడుతున్నట్లు తనిఖీల్లో గుర్తించామని తెలిపారు.

ఈసీజీ రోల్స్ దందాపై విచారణ

ఈసీజీ రోల్స్‌లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. రోజూ ఈసీజీ రోల్స్ ఎవరు ఇస్తున్నారు.. ఇండెంట్ ఎవరు ఇస్తున్నారు.. ఎవరి ద్వారా తీసుకుంటున్నారు ? అనే అంశాలపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించామని సూపరింటెండెంట్ వెల్లడించారు. ఈసీజీ రోల్స్ బయటకు తీసుకుని వెళ్లి దందా చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై వెంటనె విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలు

డీఏపీ వైద్యుడు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర చికిత్స విభాగంలో అనధికారికంగా తిరుగుతున్న ప్రైవేట్ ల్యాబ్ టెక్నిషియన్‌ను గుర్తించి ఔట్ పోస్ట్ పోలీసులకు అప్పగించినట్లు సూపరింటెండెంట్ చెప్పారు. అనంతరం ట్రయల్ రన్‌లో ఉన్న సీటీ స్కాన్ మిషన్‌ను సూరింటెండెంట్ పరిశీలించారు. సర్వీస్ ఇంజనీర్‌తో మాట్లాడి వెంటనే రోగులకు అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఆధునిక కేర్ యూనిట్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంత ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్:పొన్నూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అరకొరగా సరఫరా చేసిన ఘటనను వెలుగులోకి తెస్తూ గురువారం ''సాక్షి''లో అందని పాఠ్య పుస్తకాలు–ప్రారంభం కాని పాఠాలు శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పొన్నూరు మండలంలోని 88 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5,557 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇండెంట్ ప్రకారం ఐదు విడతల్లో వెండర్ నుంచి మండల స్టాక్ పాయింట్‌కు వచ్చినట్లు సమగ్ర శిక్షా ఏపీసీ జి. విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. పాఠ్య పుస్తకాలు వచ్చిన వెంటనే పాఠశాలలకు పంపిణీ చేశామని, ఒకటో తరగతి తెలుగు రీడర్ 60, ఏడు తరగతి ఇంగ్లీష్ రీడర్ 50 పుస్తకాలు రావాల్సి ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇండెంట్ ప్రకారం బ్యాగులు, యూనిఫాం, బెల్టులు, నోటు పుస్తకాలు, బూట్లు నూరు శాతం పంపిణీ చేశామని తెలిపారు.

పథకాలపై మత్స్యకారులకు అవగాహన

చీరాల: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనపై మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పి.సురేష్ సూచించారు. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో శుక్రవారం మత్స్యసంపద యోజన పథకం ద్వారా లబ్ధిపొందిన వారితో కేంద్ర మత్స్యశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వాల పథకాలపై జిల్లా అధికారి అవగాహన కల్పించారు.

విద్యాదాత సుబ్బరాయ శ్రేష్ఠి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను వందేళ్ల కిందటే పట్టణ ప్రజలకు అందించిన వితరణశీలి సుబ్బరాయ శ్రేష్ఠి అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కొనియాడారు. శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం సుబ్బరాయ శ్రేష్ఠి 67వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, కళాశాల పాలక వర్గ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది సుబ్బరాయ శ్రేష్ఠి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్ని దానాల్లోకి విద్యాదానం గొప్పదని గుర్తించి 75 సంవత్సరాల కిందటే కళాశాలను ఏర్పాటు చేసిన మహనీయులు సుబ్బరాయ శ్రేష్ఠి అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపిలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సుబ్బరాయ శ్రేష్ఠి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

డయేరియా బాధితులకు ఏరియా వైద్యశాలలో చికిత్స

సత్తెనపల్లి: పిడుగురాళ్లలో డయేరియా బారిన పడిన రోగులకు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 8 నుంచి 12 మంది డయేరియా బాధితులు రాగా, వీరిలో ఏడుగురు ఇప్పటికే డిశ్చార్జి అయ్యారు. మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. శుక్రవారం మరో ఇద్దరు ఆస్పత్రిలో చేరారు. వీరితో కలిపి ప్రస్తుతం ఏడుగురు చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర ఎపిడమాలజిస్ట్ డాక్టర్ పద్మజతో కూడిన బృందం శుక్రవారం వైద్యశాలను సందర్శించింది. డయేరియాకు గల కారణాలను రోగులను అడిగి తెలుసుకుంది. ప్రధానంగా నీటి కలుషితం, డ్రైనేజీ అస్తవ్యస్త నిర్వహణ కారణంగా వ్యాధి బారిన పడినట్లు రోగులు తెలిపారు. దీనిపై వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావుతో మాట్లాడారు. అనంతరం ఆ బృందం పిడుగురాళ్ల వెళ్లింది.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యసమాజం

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన బిహార్ బృందం

గుంటూరు రూరల్: ప్రకృతి సేద్యంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంగళాయపాలెంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బిహార్‌కు చెందిన రూరల్ లైవ్లీహుడ్స్ రాష్ట్ర కార్యాలయం ప్రతినిధుల బృందం అనిల్‌కుమార్ యాదవ్, వంశీకృష్ణారెడ్డి, కునాల్‌కిషోర్, కౌటిల్య కుమార్, సంతోష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా రాజకుమారి ఇక్కడి రైతులు అవలంబిస్తున్న పద్ధతుల గురించి బిహార్ ప్రతినిధులకు వివరించారు. ప్రకృతి సేద్యంలో మహిళా సంఘాల పాత్ర గురించి సంఘ సభ్యులతో బిహార్ ప్రతినిధులు సమావేశమై చర్చించారు. గ్రామానికి చెందిన ప్రకృతి రైతు గురవయ్య అవలంబిస్తున్న యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం ఏ గ్రేడ్ మోడల్‌ను బిహార్ ప్రతినిధులు సందర్శించారు. కార్యక్రమంలో ఆర్‌పీసీ వెంకటరావు, ఏవో శ్రీనివాసరావు, డీఎల్ఎంపీ సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయం రైతులు, మహిళా సంఘాల మహిళా రైతులు, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న బిహార్ బృందం

రైతుభరోసా హామీని తక్షణమే అమలు చేయాలి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: రైతుభరోసా పథకాన్ని రూ.20 వేలకు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లిపర మండల గ్రామం వల్లభాపురంలోని పేరంటాలమ్మ గుడి వాద్ద శుక్రవారం జరిగిన రైతుల సమావేశంలో శివసాంబిరెడ్డి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థికసాయం చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నట్టు గుర్తుచేశారు. అదేవిధంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుకు అసెంబ్లీలో చట్టం చేయాలని కోరారు. పంటకాల్వలు, మురుగుకాల్వల్లో తూటాకు, గుర్రపుడెక్కను తొలగించాలని కోరారు. కౌలురైతులకు సాయానికి అడ్డంకిగా మారిన భూయజమాని సంతకం అనే నిబంధనను తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. లంకిరెడ్డి సాంబిరెడ్డి, గుదిబండి శివరామిరెడ్డి, అవుతు నాగిరెడ్డి, అత్తోట వీరయ్య, తాడిబోయిన ఏడుకొండలు, వంగా మల్లారెడ్డి, వి.విజయరాణి, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

విట్ ఏపీలో పేద విద్యార్థులకు స్టార్స్ పథకం ద్వారా ఉచిత ప్రవేశం

తాడికొండ: వీఐటీ ఏపీ విశ్వ విద్యాలయంలో ఏపీలోని 26 జిల్లాలకు చెందిన 52 మంది పేద విద్యార్థులలో 48 మందికి ఉచిత ప్రవేశాలు అందించినట్లు వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి తెలిపారు. ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలలో జిల్లా టాపర్లుగా ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు స్టార్స్ (సపోర్ట్ ద అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ రూరల్ స్టూడెంట్స్) పథకం ద్వారా ఉన్నత విద్యను ఉచితంగా అందించేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. వీరికి విద్య, వసతి సౌకర్యాలలో 100 శాతం ఫీజు మినహాయింపును అందించనున్నట్టు వివరించారు. ఈ పథకాన్ని తొలుత తమిళనాడులోని వెల్లూరులో వీఐటీ విశ్వ విద్యాలయంలో 2008లో వ్యవస్థాపక చాన్స్‌లర్ జి.విశ్వనాథన్ చేతుల మీదుగా ప్రారంభించి తదనంతరం వీఐటీ– చెన్నై, వీఐటీ–ఏపీ, వీఐటీ–భోపాల్ క్యాంపస్‌లకు విస్తరించినట్లు తెలిపారు. విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ వీఐటీ– ఏపీ విశ్వ విద్యాలయం విద్యార్థుల కలలను సాకారం చేస్తుందన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్స్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాన్ ప్రదీప్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ కుమార్ మిశ్రా, స్టార్ పథకం కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకట లక్ష్మీ, చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గుంటి దయానంద్ పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉచిత విద్యనభ్యసించడానికి ఎంపికైన విద్యార్థులతో వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి

వైభవంగా బోనాల మహోత్సవం

పిడుగురాళ్ల: పట్టణంలోని కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని బోనాల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మొదటి శుక్రవారం కావడంతో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి చీర, జాకెట్, వడి కట్టు బియ్యం, పూలు, గాజులు, పసుపు కుంకుమతో బోనాలను సమర్పించారు. ఆలయ పూజారి పూర్ణానందశాస్త్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.



అమ్మ వారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గురువారం ప్రకటించిన సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిశోర్ తెలిపారు. కొత్త పేటలోని శ్రీమేధ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నందకిశోర్ మాట్లాడుతూ తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ మార్కులతో పాటు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. గత 19 ఏళ్లుగా సీఏ సీఎంఏ కోర్సుల్లో 450కు పైగా అఖిల భారతస్థాయిలో ర్యాంకులు సాధించామని తెలిపారు. ప్రస్తుత ఫలితాల్లో తమ విద్యార్థి ఎన్.సంతోష్ కుమార్ 400 మార్కులకు గాను 338, షేక్ ఫిర్దోస్ 316, బి. నరసింహ సాయి ధీరజ్ 312, బి.వెంకట శివ సాయి కార్తీక్ 310, ఎస్.భువన్ వెంకట సాయి 304, కె.తిరుమల సాయి సంతోష్ 304, వి.శరణ్య లక్ష్మి 302, బి.రాహుల్ 302, ఎన్.భవ్య సాయి 300, ఎస్. కిషోర్ 300, షేక్ సలాం 300 వంటి టాప్ మార్కులు సాధించారని వివరించారు. ఇంటర్మీడియెట్ నుంచి సీఏ, సీఎంఏ ఫౌండేషన్ కోర్సులకు కాయిన్ ప్రోగ్రాం ద్వారా అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అందిస్తున్న శిక్షణ ద్వారా తమ విద్యార్థుల అఖిల భారతస్థాయిలో టాప్ మార్కులు సాధించారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని నందకిశోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి అభినందించారు.



విద్యార్థులతో శ్రీమేధ చైర్మన్ నందకిషోర్

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలి

తెనాలి రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. శంకరరావు పిలుపు మేరకు యూనియన్ తెనాలి శాఖ సభ్యులు నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. స్థానిక సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తెనాలి శాఖ చైర్మన్, కార్యదర్శి నరేష్, వేణుగోపాల్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. జి. రవిబాబు, ఎం. నరేష్, బి. ప్రభాకరబాబు, గోపినాయక్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ప్రసన్నకుమార్, రాజశేఖర్ పిచ్చియ్య, వినయ్‌కుమార్, మల్లేశ్వరి తదితర రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

